VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 96

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

గురువారం 10 సెప్టెంబర్ 2026

# ప్రతి వారమూ ప్రజల మధ్యలోనే

## ఈపీడీసీఎల్ చేపట్టిన విద్యుత్ గ్రిడ్ ఆధునీకరణ పనులకు సీఎం శంకుస్థాపన

- సంక్షేమం-అభివృద్ధి-సుపరిపాలనే మూల మంత్రాలు
- గత పాలకుల పాపాల్ని కడిగి రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన
- 16 లక్షల ఎకరాలు 22ఏ జాబితా నుంచి తొలగింపు
- రీసర్వే 2.0 తో రాష్ట్రంలో భూ వివాదాలన్నీ పరిష్కారం
- పి.గన్నవరం 'మీ భూమి- మీహక్కు' గ్రామ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు








**పి.గన్నవరం,కలంకౌంటర్ :** సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే మూల మంత్రాలుగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రతి వారమూ ప్రజల మధ్యలోనే ఉంటున్నానని వెల్లడించారు. రాష్ట్ర సచివాలయానికి మాత్రమే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో వెలుగు వచ్చేలా చేయటమే అసలైన సుపరిపాలన అని దానికి కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని అన్నారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం పండువారిపేటలో నిర్వహించిన మీ భూమి- మీహక్కు గ్రామసభలో సీఎం పాల్గొని సీఎం ప్రసంగించారు. ప్రతి నెలలోనూ వీలైనన్ని సార్లు ప్రజల మధ్యకు వచ్చి బాగోగులు తెలుసుకుంటున్నానని అన్నారు. ప్రతినెలా మొదటి తేదీనే పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తూ ప్రజల్ని కలుస్తూ వారి కష్ట సుఖాలను తెలుసుకుంటున్నానని అన్నారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కింద నాలుగో శనివారం హాజరవుతున్నట్టు సీఎం వివరించారు. పీ4తో సామాజిక బాధ్యత కింద ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. అభివృద్ధి చేస్తేనే సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని జీవన ప్రమాణాలు పెంచి అంతా గౌరవంగా జీవించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**భూమికి భద్రత ఇచ్చేలా..** ప్రతీ నెలా 9 తేదీనే మీ భూమి- మీ హక్కు కార్యక్రమానికి హాజరై రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. భూమిపై రైతులు, యజమానులకు హక్కులు కల్పించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పాలకులు రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి వ్యవస్థను ధ్వంసం చేశారని అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తెచ్చి ప్రజల భూముల్ని కాజేసే ప్రయత్నం చేశారని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ చట్టాన్ని రద్దు చేసేశామని తెలిపారు. గత పాలకులు రీసర్వే పేరుతో అనేక ఘోరాలు, నేరాలు, పాపాలు చేశారని.. పూర్వీకుల నుంచి వచ్చిన వారసత్వ భూములపై కూడా తమ ఫోటోలు వేసుకున్నారని అన్నారు. సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకునే పిచ్చి ఏమిటో ఎవరికీ అర్థం కాలేదన్నారు. ఇష్టం లేని వ్యక్తుల భూముల్ని, ఆస్తుల్ని 22ఏ జాబితాలో చేర్చి ఇబ్బందులు పెట్టారన్నారు. అందుకే పటిష్టంగా రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి ఎక్కడా అవకతవకలు లేకుండా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ఇస్తున్నామన్నారు. ఈ-కేవైసీ, క్యూఆర్ కోడ్ , బ్లాక్ చెయి-న్ టెక్నాలజీ లాంటి భద్రతా ఫీచర్లను పెట్టి పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని అన్నారు.

**రెవెన్యూ సంస్కరణలు..** భూమికి భద్రత ఇవ్వటమే కూటమి ప్రభుత్వ అజెండా అని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ 8234 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 36 లక్షల రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చినట్టు సీఎం వివరించారు. వచ్చే మార్చి నాటికి 8,582 గ్రామాల్లో 56 లక్షల పాస్ పుస్తకాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటో మ్యూటేషన్ సేవల్ని అందుబాటులోకి తెచ్చామని అన్నారు. వారసత్వ భూముల విభజనలో స్టాంప్ డ్యూటీని రూ.వెయ్యికే పరిమితం చేశామని అన్నారు. 1.25 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలిగిందన్నారు. తప్పులు సరిచేసి 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి సమస్యను పరిష్కరించామని వివరించారు. శెట్టిపల్లి కంగుంది, వట్టి చెరుకూరు, ముదినేపల్లి లాంటి చోట్ల దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న 244 కీలక భూ సమస్యలకు విముక్తి కల్పించామని అన్నారు. అమలాపురంలోని మాచవరం, ముమ్మిడివరం, రామచంద్రాపురం లో బ్రిటీష్ కాలంలో 1908 నుంచి 22 ఏ1 కింద భూములు నిషేధంలో ఉన్నాయని ఈ సమస్యను కూడా పరిష్కరిస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. 56.37 ఎకరాల భూమిని 1410 మందికి లబ్ధి కలిగేలా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. గొడ్డలి పార్టీ చేసిన తారుమారు చేసిన రికార్డుల్ని ప్రక్షాళన చేసి భూ సమస్యల్ని కొలిక్కి తెస్తున్నామని సీఎం వివరించారు.

**నిత్యం ప్రజల గురించే తపన..** నీటి భద్రతకు, భూమి భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం

2లో

# ఎన్నారైల అండతో తెలుగుదేశం జెండా రెపరెపలు

- చంద్రబాబు అక్రమ అరెస్ట్ సమయంలో ఎన్ఆర్ఐలు అండగా నిలిచారు
- ప్రజాప్రభుత్వం అధికారంలోకి రావడంలో ఎన్ఆర్ఐల కృషి మరువలేనిది
- తెలుగుజాతి ఆత్మగౌరవం ఎన్టీఆర్
- తెలుగు జాతిని నెం.1గా చేసే బాధ్యత తీసుకుందాం
- 2029 ఎన్నికల్లో ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉంది
- ఎన్ఆర్ఐ టీడీపీ సెంట్రల్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో మంత్రి లోకేష్







**మంగళగిరి,కలంకౌంటర్ :** వచ్చే ఎన్నికల్లో ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, తెలుగుజాతిని నెం.1గా చేసే బాధ్యత సమిష్టిగా తీసుకుందామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎన్ఆర్ఐ టీడీపీ సెంట్రల్ కమిటీ కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రి లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎన్ఆర్ఐ టీడీపీ సెంట్రల్ కమిటీ సభ్యులతో ఎన్ఆర్ఐ ఎంపవర్ మెంట్ అండ్ రిలేషన్స్ మినిస్టర్ కొండపల్లి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడిగా డా.పి.గురురాజా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ప్రపంచంలో తెలుగువారు లేని దేశం లేదు. ఏ దేశానికి వెళ్లినా తెలుగులో మాట్లాడితే కనీసం 20మందైనా స్పందిస్తారు. తెలుగువారి ఆత్మగౌరవం స్వర్గీయ ఎన్టీఆర్. రాజకీయాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. రాజకీయాల్లో చదువుకున్న వారికి, మేధావులకు అవకాశం కల్పించారు. సమాజంలో మార్పు కోసం కృషిచేసిన వ్యక్తి అన్న ఎన్టీఆర్. ఆయన ఆశయాలను చంద్రబాబు గారు ముందుకు తీసుకెళ్తున్నారు. 2024 ఎన్నికల్లో తొలిసారిగా 50శాతం స్థానాల్లో యువకులు గెలుపొందారు. ఏడుగురు ఎన్ఆర్ఐలకు కూడా అవకాశం కల్పించిన పార్టీ తెలుగుదేశం పార్టీ. పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు ఎంపీగా విజయం సాధించి కేంద్ర మంత్రిగా పనిచేస్తున్నారు.

**చంద్రబాబు గారి అరెస్ట్ సమయంలో ఎన్ఆర్ఐలు అండగా నిలిచారు..** 2019-24 మధ్య రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారు. ఆనాడు అమరావతి ఉద్యమానికి ఎన్ఆర్ఐలు మద్దతుగా నిలిచారు. కేసులు పెట్టినా భయపడలేదు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడారు. చంద్రబాబు గారిని అక్రమంగా అరెస్ట్ చేసినప్పుడు 50 దేశాల్లో 200 పట్టణాల్లో ఎన్ఆర్ఐలు కార్యక్రమాలు నిర్వహించారు. నారా బ్రాహ్మణి మనకు రాజకీయాలు అవసరమా అని ప్రశ్నించారు. అలాంటి సమయంలో నిర్వహించిన 'ఐయామ్ విత్ సీబీఎన్' కార్యక్రమం మా కుటుంబానికి కొండంత బలంగా నిలిచింది. మళ్లీ ప్రజలకు సేవ చేయాలని నిర్ణయించుకున్నాం. ఐదు వేల డాలర్లు ఖర్చుపెట్టి ఓటు వేయడానికి రాష్ట్రానికి వచ్చారు. కొన్ని నెలల పాటు ఉద్యోగాలకు సెలవు పెట్టి గ్రామాల్లో తిరిగారు. ప్రజలను చైతన్య పరిచారు. ప్రజాప్రభుత్వ ఏర్పాటులో భాగస్వాములయ్యారు.

**ఎన్ఆర్ఐలు అంటే మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్..** ఎన్ఆర్ఐలు అంటే మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్. మంచి ఉద్యోగాలు చేస్తున్నా.. నమ్ముకున్న పార్టీ కోసం, తెలుగుజాతి కోసం నిలబడ్డారు. మీ పిల్లలకు అద్భుతమైన తెలుగు నేర్పిస్తున్నారు. తెలుగుతనం ఏనాడూ మర్చిపోలేదు. సొంత గ్రామాలపై మమకారం, సేవాభావం ఎక్కువ. మీరు చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి కోట్ల రూపాయలు వెచ్చించారు. అదీ మీ కమిట్ మెంట్. ఇందుకు హృదయపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నా.

**తెలుగుజాతిని నెం.1గా చేసే బాధ్యత తీసుకుందాం..** తెలుగుజాతి గురించి ఆలోచించే పార్టీ తెలుగుదేశం పార్టీ. టీడీపీ అధికారంలో ఉన్నా, లేకపోయినా

2లో




## బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలతో వై ఎస్ జగన్ సమావేశం దశ దిశా నిర్దేశం

-తాడేపల్లి,కలంకౌంటర్ :



# నీటి వనరులను కాపాడుకుంటేనే భవిష్యత్తు

- సోలార్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- అద్దంకి ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేస్తాం
- నైపుణ్య శిక్షణ కేంద్రంతో మహిళలకు కుట్టు శిక్షణ
- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్





**అద్దంకి,కలంకౌంటర్ :** నీటి వనరులను కాపాడుకుంటూ, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రజలకు సూచించారు. అద్దంకిలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాన్నిమంత్రి గొట్టిపాటి బుధవారంనాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా నీటి వనరుల ఆవశ్యకతను మంత్రి గొట్టిపాటి ప్రజలకు వివరించారు. చెరువులు, కాలువలు ఆక్రమణలకు గురికాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటిని వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు చేసుకోవాలని కోరారు. నీటి వినియోగంపై ప్రజలు బాధ్యతగా వ్యవహరించకపోతే

2లో

# శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల బుక్లెట్ విడుదల

- సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు
- అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు

**తిరుమల,కలంకౌంటర్ :** తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన 2026 సంవత్సర బుక్లెట్‌ను బుధవారం తిరుమల అన్నమయ్య భవనంలో జరిగిన టీటీడీ బోర్డు సమావేశం సందర్భంగా టీటీడీ చైర్మన్ శ్రీ బీ.ఆర్. నాయుడు, ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర, బోర్డు సభ్యులు కలిసి ఆవిష్కరించారు. తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు, నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు టీటీడీ తెలిపింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి నిర్వహించే వివిధ వాహన సేవలు, విశేష ఉత్సవాలు, ముఖ్య కార్యక్రమాల వివరాలను భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి ఈ బుక్లెట్ రూపొందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అడిషనల్ ఈవో శ్రీ సిహెచ్. వెంకయ్య చౌదరి, జేఈవోలు డా. ఎ. శరత్, శ్రీ ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో శ్రీ కే.వి. మురళీకృష్ణతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



# ఆర్యవైశ్య జర్నలిస్టులకు ఘన సన్మానం



**మార్కాపురం,కలంకౌంటర్ :** వాసవి క్లబ్ వ్యవస్థాపకులు, స్వాతంత్ర్య సమరయోధులు స్వర్గీయ కే.సీ. గుప్తా 107వ జయంతి వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆర్యవైశ్య జర్నలిస్టులకు ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గవర్నర్ సూరే సురేంద్ర, రీజియన్ చైర్మన్ సూరే కేశవరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య జర్నలిస్టులను ఘనంగా సన్మానించి, సమాజానికి వారు అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ కుందూరి రవి వాసవి క్లబ్ అధ్యక్షుడు బైసాని కోటేశ్వరరావు, కార్యదర్శి గెల్లి ప్రసాద్, వనితా క్లబ్ ప్రెసిడెంట్ టంగుటూరి దివ్యతేజ, కోశాధికారి మోదాల జ్యోతి, విజన్ క్లబ్ ప్రెసిడెంట్ కామిశెట్టి నవీన్, కార్యదర్శి కొత్త మాసు మురళీకృష్ణ, కోశాధికారి అన్నా రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి మాతృ వందన సద్వినియోగం చేసుకోండి



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** ప్రధానమంత్రి మాతృ వందన కార్యక్రమాన్ని అంగన్వాడీల్లో పటిష్టంగా అమలు చేయాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ బేబీ సరోజిని అన్నారు. జాతీయ పోషక మాస ఉత్సవాలను బుధవారం మండలంలోని కలవపాముల గ్రామంలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అంగన్వాడీల్లో చదువుకునే పిల్లలు అందించాలని అలాగే గర్భిణీ స్త్రీలు బాలింతల పట్ల జాగ్రత్త వహించి వారికి తగిన రీతిలో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్వాడీ టీచర్లు మహాలక్ష్మి గంగాభవాని గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బంటుమిల్లిలో లైవ్ వెబ్ ద్వారా 9వ జాతీయ పోషణ్ మహా కార్యక్రమం



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 10 వరకు జరుగు తొమ్మిదవ జాతీయ పోషణ్ మహా కార్యక్రమం ను బుధవారం బంటుమిల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ సముద్ర వేణి ఆధ్వర్యంలో బంటుమిల్లి 1 సచివాలయంలో లైవ్ వెబ్ కాస్ట్ ద్వారా ప్రసారం కాబ డిన కార్యక్రమాన్ని, తల్లులు అంగన్వాడీలు వీక్షించారు. దేశవ్యాప్తంగా ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని ఉత్తరప్రదేశ్ వారణాసిలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చేతుల మీదగా 9వ జాతీయ పోషణ్ మహా కార్యక్రమం లైవ్ వెబ్కాస్ట్ ద్వారా ప్రారంభ మైనది. కార్యక్రమాన్ని వీక్షించిన అనంతరం బంటుమిల్లి సిడిపిఓ సముద్ర వేణి 9వ జాతీయ పోషన్ మహా కార్యక్రమంలో ఇచ్చిన ఐదు థీమ్స్ గురించి అంగన్వాడీలకు వివరించారు. ఈ లైవ్ వెబ్ కార్యక్రమాన్ని సిడిపివో తో పాటు సూపర్వైజర్లు ఏడబ్ల్యాడబ్ల్యాఎస్ మరియు తల్లులు వీక్షించారు.

## పెద్దపులి మృతి కేసులో రాచర్ల ఎఫ్బీవో పై వేటు

**గిద్దలూరు,కలంకౌంటర్ :** గిద్దలూరు అటవీ డివిజన్లో సంచలనం సృష్టించిన పెద్దపులి మృతి కేసులో రాచర్ల ఫారెస్ట్ బీట్ ఆఫీసర్(ఎఫ్బీవో) కె. లక్ష్మానాయక్ పై సస్పెన్షన్ వేటు పడింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు గాను ఆయనను సస్పెండ్ చేస్తూ ఒంగోలు జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్వో) వినోద్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుండ్లకమ్మ రేంజ్, రాచర్ల బీట్ పరిధిలోని జేపీ చెరువు సమీప నల్లమల అటవీ ప్రాంతంలో గల అంబచెరువు, లెట్టెమడుగు పరిసరాల్లోని లోతు వాగులో జూలై 31న పెద్దపులి కళేబరం లభ్యమైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై గిద్దలూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టింది. ఎఫ్బీవో లక్ష్మానాయక్ తన బీట్ పరిధిలో పులుల రక్షణ, పర్యవేక్షణ బాధ్యతలను గాలికొదిలేశారని విచారణలో తేలింది. ఆయన నిర్లక్ష్యం కారణంగానే వేటగాళ్లు అటవీ ప్రాంతంలోకి అక్రమంగా చొరబడి పెద్దపులిని వేటాడి, దాని శరీర భాగాలను అపహరించినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు

# ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ



**కందుకూరు,కలంకౌంటర్ :** మాజీ సర్పంచ్ స్వర్గీయ దివి పిచ్చయ్య చౌదరి కుమారుడు తెలుగుదేశం పార్టీ నాయకులు దివి రవీంద్రనాథ్ జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం కందుకూరు పట్టణంలోని మార్కెట్ సెంటర్ లో గల అన్న క్యాంటీన్ నందు దివి కుటుంబం అభిమానులు కేక్ కట్ చేసి రవీంద్రనాథ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం అన్న క్యాంటీన్ నందు మూడు పూటల పేదలకు ఉచితంగా అన్నదానంతో పాటు స్వీట్లు , పండ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నందు పేషెంట్లకు పండ్లు పంపిణీ , కోవూరు రోడ్ లో గల స్వర్ణ స్వయంకృషి మానసిక వికలాంగుల పాఠశాల నందు పిల్లలకు అన్నదానంతో పాటు స్వీట్లు , పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇంద్రాణీ , డాక్టర్ శకుంతల, తెలుగుదేశం పార్టీ నాయకులు, గోచిపాతల మోషే , కందుకూరు మండలం మాజీ ఎంపీపీ పొడపాటి శ్రీనివాసరావు , కందుకూరు నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు మోదడుగు వెంకటేశ్వర్లు , కందుకూరు నియోజకవర్గం తెలుగురైతు కమిటీ మీడియా కో - ఆర్డినేటర్ దివి శ్రీధర్ బాబు, టిడిపి నాయకులుకాకర్ల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.





# పి. గన్నవరం నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షా సమావేశం

-పి. గన్నవరం,కలంకౌంటర్ :

# ఎన్నారైల అండతో తెలుగుదేశం జెండా రెపరెపలు

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తరాఖండ్ వరదల సమయంలో ప్రత్యేక విమానం పెట్టి తెలుగువారిని రక్షించాం. ఉక్రెయిన్ పై దాడుల సమయంలో తెలుగువారికి అండగా సీబీఎన్ నిలిచారు. గతేడాది సంక్షోభం కారణంగా నేపాల్ లో చిక్కుకుపోయిన తెలుగువారి కోసం ప్రత్యేక విమానం ఏర్పాటుచేసి వారిని సురక్షితంగా ఇళ్లకు తరలించాం. ఎన్ఆర్ఐలు తెలుగుజాతికి బ్రాండ్ అంబాసిడర్లు. తెలుగుజాతిని నెం.1గా చేసే బాధ్యత తీసుకుందాం. ఇందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దాం. మీరు పనిచేసే కంపెనీలు ఏపీకి వచ్చేందుకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలి. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వస్తున్నాయి. ఏపీ అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు భాగస్వామ్యం కావాలి.

**ఎన్ఆర్ఐ సభ్యత్వం తీసుకురావాలి..** ప్రజాప్రభుత్వం అధికారంలోకి రావడానికి మీరు చేసిన కృషి మరువలేనిది. ఎన్ఆర్ఐ సభ్యత్వాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉంది. మీరంతా 'మై టీడీపీ యాప్' తో అనుసంధానం కావాలి. 2019-24 మధ్య అనేక మంది న్యూట్రల్స్ కు ఫోన్ చేసి ఎన్నికల్లో గెలుపునకు కృషిచేశారు. తిరిగి ఆ కార్యక్రమాన్ని ప్రారంభించాలి. డాక్టర్ గురురాజా గారిపై బాధ్యత పెరిగింది. ఏ దేశంలో పది మంది ఉన్నా ఎన్ఆర్ఐ టీడీపీ కమిటీ ఉండాలని కోరుతున్నా. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమం జయప్రదం చేయాలి. రాబోయే 30 రోజుల్లో ఇప్పుడున్న కమిటీలను పూర్తిచేద్దాం. కష్టపడిన వారికి కమిటీల్లో స్థానం కల్పించాలి.


**2029 ఎన్నికల్లో ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉంది..** చంద్రబాబు గారిని అక్రమంగా అరెస్ట్ చేసి నేటికి మూడేళ్లు. దొంగ కేసు పెట్టి అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. రూ.3వేల కోట్ల అవినీతి అన్నారు. తర్వాత మూడొందల కోట్లు, తర్వాత 3 కోట్లు అన్నారు. చివరకు ఒక్క రూపాయి అవినీతిని నిరూపించలేకపోయారు. ఐటీ, ఈడీ, కోర్టు క్లీన్ చిట్ ఇచ్చింది. చంద్రబాబు గారు ఏ తప్పూ చేయలేదు. ఆయన అభివృద్ధి చేసిన జైల్లోనే నిర్బంధించారు. మనమంతా 24 గంటలు పోరాడాం. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ లో తెలుగువారు రోడ్లపైకి వచ్చారు. అదే మా కుటుంబానికి కొండంత బలం. ఈ రోజు రాత్రి ఇళ్లలో, కలిసికట్టుగా 53 రోజుల అక్రమ నిర్బంధానికి గుర్తుగా 53 క్యాండిల్స్ వెలిగిద్దాం. అక్రమ అరెస్ట్ ను జ్ఞాపకం చేసుకుందాం. చంద్రబాబు గారు ఎప్పుడూ తెలుగుజాతి నెం.1గా ఉండాలని ఆలోచించే వ్యక్తి. అలాంటి నాయకుడికి అందరం అండగా నిలవాలి. 2029 ఎన్నికల్లో ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.

# నీటి వనరులను కాపాడుకుంటేనే భవిష్యత్తు

● ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

(మొదటిపేజీ తరువాయి)

భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని ఆయన హెచ్చరించారు. అధిక ఎండలు, ఎల్నినో వంటి పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవాలంటే నీటి వనరులను సంరక్షించుకోవడం ఎంతో కీలకమని వివరించారు. అదే విధంగా సబ్సిడీతో వచ్చే పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి గొట్టిపాటి పిలుపునిచ్చారు. సోలార్ రూఫ్టాప్ యూనిట్లను ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని ప్రతి కుటుంబం వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రంలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకునే సుమారు 6 లక్షల ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ఉచితంగా సోలార్ రూఫ్టాప్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. మూడు కిలోవాట్ల సోలార్ యూనిట్కు కేంద్ర ప్రభుత్వం రూ.78 వేల సబ్సిడీ అందిస్తుందని, బీసీ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.20 వేలు సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. సోలార్ విద్యుత్ ద్వారా ఇంటి అవసరాలకు కావాల్సిన విద్యుత్ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవచ్చని వివరించారు. అదే విధంగా అద్దంకిలో చేతివృత్తుల కోసం ప్రత్యేకంగా నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి గొట్టిపాటి తెలిపారు. మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి, వారు స్వయం ఉపాధి పొందేలా ఉచితంగా కుట్టుమిషన్లు అందిస్తామని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాలతో మహిళలు ఆర్థిక స్వావలంబన పొందవచ్చని వెల్లడించారు.



# ఈపీడీసీఎల్ చేపట్టిన విద్యుత్ గ్రిడ్ ఆధునీకరణ పనులకు సీఎం శంకుస్థాపన

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో తీవ్రమైన ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి నుంచి ఈ ఏడాది వెయ్యి టీఎంసీలకు పైగా నీరు సముద్రంలోకి వెళ్లిందన్నారు.ఆ నీటిని వినియోగించుకుంటే రాష్ట్రానికి ప్రయోజనం కలిగేదని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో డయాఫ్రామ్ వాల్ కొట్టుకు పోయిందని.. రాజకీయ కక్షతో కాంట్రాక్టర్ని మార్చటంతో ప్రాజెక్టు ఆలస్యమైందని స్పష్టం చేశారు. 2024లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన మద్దతు ఢిల్లీలోనూ సంజీవనిగా పనిచేసిందని రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నట్టు వివరించారు. ప్రజలకు మరింతగా మేలు చేసే అంశంపై రెండు రోజుల పాటు సమావేశం నిర్వహించి ఎమ్మెల్యేలకూ దిశానిర్దేశం చేశామన్నారు. జిల్లా కలెక్టర్లతోనూ సమావేశాలను నిర్వహించి క్షేత్రస్థాయిలో పౌరసేవల్ని అందించే అంశంపై స్పష్టంగా ఆదేశాలు ఇస్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇన్ని రకాల ఆలోచనలతో ప్రజలకు మేలు చేస్తుంటే గొడ్డలి పార్టీ నిత్యం కుట్రలు పన్నుతూ అభివృద్ధిని అడ్డుకుంటోందని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. అంతకు ముందు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఈపీడీసీఎల్ రూ.240 కోట్ల వ్యయంతో చేపట్టిన 3 ఫేజ్ కరెంటు ఇచ్చేలా గ్రిడ్ ఆధునీకరణ పనులకు సంబంధించి శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్, స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

# విద్యార్థి దశ నుంచి పరిశోధన నాయకత్వం వరకు

● రాయచోటి గడ్డపై విద్యార్థిగా ప్రారంభమైన ఓ సాధారణ ప్రయాణం. ● అంతర్జాతీయ స్థాయిలో పరిశోధకురాలిగా

ఇంటర్వ్యూ....డి వి సుప్రియ



వీఎల్ఎస్ఐలో పీహెచ్డీ నుంచి క్వాంటమ్ కంప్యూటింగ్లో పోస్ట్ డాక్టరల్ పరిశోధన వరకు విస్తరించిన ఆమె పరిశోధనా ప్రయాణం ఆధునిక సాంకేతిక రంగాలపై ఆమెకున్న ఆసక్తికి అద్దం పడుతుంది. విద్యార్థులను కేవలం పరీక్షలకు సిద్ధం చేయడం కాకుండా, ప్రశ్నించే ఆలోచన, సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం వైపు నడిపించాలనే లక్ష్యంతో ఆమె పనిచేస్తున్నారు. అధ్యాపకురాలిగా ప్రారంభమైన ప్రస్థానం ప్రొఫెసర్గా, పరిశోధన మరియు అభివృద్ధి విభాగం డీన్గా ఎదగడం మాత్రమే కాకుండా, అనేక పురస్కారాలు, వృత్తిపరమైన గుర్తింపులను అందుకుంది. ముఖ్యంగా విద్యలో సాంకేతికత మరియు ఆవిష్కరణ పురస్కారం, ఐఈఈఈ సీనియర్ సభ్యత్వం వంటి గుర్తింపులు ఆమె కృషికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. "నిరంతరం నేర్చుకోవడం... కొత్తదాన్ని అన్వేషించడం... సాధించిన విజయాన్ని తదుపరి లక్ష్యానికి పునాదిగా మార్చుకోవడం" అనే ఆలోచనతో ముందుకు సాగుతున్న డా. గ్రంధే నాగ జ్యోతి, నేటి యువతకు, ముఖ్యంగా ఇంజినీరింగ్ రంగంలో ఎదగాలనుకునే మహిళలకు ఒక స్ఫూర్తిదాయకమైన ఆదర్శం. వీఎల్ఎస్ఐ నుంచి క్వాంటమ్ కంప్యూటింగ్ వరకు సాగుతున్న ఈ ఆసక్తికరమైన పరిశోధనా ప్రయాణం, ఆమె విద్యా ప్రస్థానం, నాయకత్వ అనుభవాలు, సాధించిన విజయాలు, యువతకు అందించే సందేశం గురించి ఆమెతో ప్రత్యేకంగా మాట్లాడుదాం...

**ప్రశ్న:** ముందుగా మీ గురించి పరిచయం ?

**జవాబు:** నా పేరు డా. గ్రంధే నాగ జ్యోతి. నా స్వస్థలం రాయచోటి, అన్నమయ్య జిల్లా. నా తల్లిదండ్రులు జి. నాగరాజు, జి. ధనలక్ష్మి. నా జీవితంలో నేను సాధించిన ప్రతి విజయానికి నా తల్లిదండ్రులు అందించిన విలువలు, ప్రోత్సాహం ఎంతో ముఖ్యమైనవి.

నా భర్త సి. కిషోర్ కుమార్, నా కుమారులు సి. శివకేశవ్, సి. వెంకట లక్ష్మీ నరసింహ అందిస్తున్న సహకారం, ప్రోత్సాహం కూడా నా జీవిత ప్రయాణంలో ఎంతో బలాన్నిస్తుంది.

**ప్రశ్న:** మీ గురించి వివరించండి.?

**జవాబు:** రాయచోటిలోని శ్రీ సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్లో బీటెక్ పూర్తి చేశాను. అనంతరం వీఐటీ విశ్వవిద్యాలయంలో ఎంటెక్, వీఎల్ఎస్ఐలో పీహెచ్డీ పూర్తి చేశాను. సహాయ ఆచార్యురాలిగా ప్రారంభమైన నా ప్రయాణం సహ ఆచార్యురాలిగా, ఆచార్యురాలిగా కొనసాగి ప్రస్తుతం శ్రీ సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్లో పరిశోధన మరియు అభివృద్ధి విభాగం డీన్గా కొనసాగుతున్నాను.

**ప్రశ్న:** ప్రస్తుతం మలేషియాలో చేస్తున్న పరిశోధన గురించి వివరించండి.?

**జవాబు:** ప్రస్తుతం మలేషియాలోని లింకన్ విశ్వవిద్యాలయంలో క్వాంటమ్ కంప్యూటింగ్పై పోస్ట్ డాక్టరల్ పరిశోధన చేస్తున్నాను. అంతర్జాతీయ పరిశోధనా వాతావరణంలో పనిచేయడం ద్వారా ఆధునిక సాంకేతికతలు, కొత్త పరిశోధనా విధానాలను నేర్చుకునే అవకాశం లభిస్తోంది. వీఎల్ఎస్ఐ నుంచి క్వాంటమ్ కంప్యూటింగ్ వరకు నా పరిశోధనా ప్రయాణం ఎంతో ఆసక్తికరంగా సాగుతోంది.

**ప్రశ్న:** ఇప్పటివరకు సాధించిన ముఖ్యమైన విజయాలు, అవార్డులు గురించి ?

**జవాబు:** కృత్రిమ మేధస్సు, వైద్య మరియు ఇంజినీరింగ్ పరిశోధనా సంస్థ నుంచి "విద్యలో సాంకేతికత మరియు ఆవిష్కరణ పురస్కారం" అందుకోవడం నాకు ఎంతో ప్రత్యేకమైన గౌరవం. అలాగే ఐఈఈఈ సీనియర్ సభ్యురాలిగా గుర్తింపు పొందడం నా పరిశోధనా ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ గుర్తింపులు భవిష్యత్తులో మరింత కృషి చేయడానికి నాకు స్ఫూర్తినిస్తున్నాయి.

**ప్రశ్న:** పరిశోధన , అభివృద్ధి విభాగం డీన్గా మీ అనుభవం ఎలా ఉంది?

**జవాబు:** ఈ బాధ్యత ద్వారా పరిశోధన, ఆవిష్కరణలు, ప్రాజెక్టులు, పరిశ్రమలతో అనుసంధానం వంటి కార్యక్రమాలను ప్రోత్సహించే అవకాశం లభిస్తోంది. విద్యార్థులు, అధ్యాపకుల్లో పరిశోధనా ఆసక్తిని పెంచి, సంస్థలో మంచి పరిశోధనా వాతావరణాన్ని ఏర్పాటు చేయడం నా ప్రధాన లక్ష్యం.

**ప్రశ్న:** ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంజినీరింగ్ విద్యార్థినులు ఏ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి?

**జవాబు:** సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సమర్థవంతమైన సంభాషణ, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యం, బృంద స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి. కృత్రిమ మేధస్సు, వీఎల్ఎస్ఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, సమాచార విశ్లేషణ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలపై అవగాహన పెంచుకోవాలి. అన్నింటికంటే ముఖ్యంగా ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలి.

**ప్రశ్న:** మహిళలు కెరీర్లో ఎదగడానికి ఎలాంటి ప్రోత్సాహం అవసరం?

**జవాబు:** మహిళల ఎదుగుదలలో కుటుంబం పాత్ర ఎంతో ముఖ్యమైనది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో పాటు విద్యాసంస్థలు మహిళలకు సమాన అవకాశాలు, పరిశోధన అవకాశాలు, నాయకత్వ బాధ్యతలు కల్పించాలి.

**ప్రశ్న:** చివరిగా మహిళలు మరియు యువతకు మీరు ఇవ్వాలనుకునే సందేశం ఏమిటి?

**జవాబు:** మీ కలలను ఎప్పుడూ చిన్నచూపు చూడకండి. మీపై మీకు నమ్మకం ఉండాలి. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, కష్టపడి పనిచేస్తూ, వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకుంటూ లక్ష్యం వైపు ముందుకు సాగాలి.

మహిళలు తమ సామర్థ్యాన్ని గుర్తించి అవకాశాల కోసం ఎదురుచూడకుండా, తమ ప్రతిభతో అవకాశాలను సృష్టించుకోవాలి. "కలలు కనండి... లక్ష్యాలను నిర్దేశించుకోండి... కష్టపడండి... ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి. మీరు సాధించలేనిది ఏదీ లేదు."





# సాగరతీరాన భక్తి వైభవం..

● 63 అడుగుల విజయ గణపతి! ● 630 కిలోల బందరు లడ్డు ● మంత్రి కొల్లు రవీంద్ర.








**మచిలీపట్నంకలంకౌంటర్ :** మంగినపూడి సాగరతీరంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న 63 అడుగుల మట్టి విజయ గణపతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించి విజయవంతం చేయాలని రాష్ట్ర గనులు, భూగర్భ మైనింగ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. స్థానిక వేడుక ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సమావేశంలో ఉత్సవ ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా చర్యలు తదితర అంశాలపై చర్చించారు. మంగినపూడి సముద్రతీరంలో వినాయక చవితి సందర్భంగా మట్టితో అపురూపంగా రూపొందిస్తున్న 63 అడుగుల విజయ గణపతిని ఈ నెల 14 నుంచి 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కొలువుదీర్చనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ 11 రోజుల్లో దాదాపు పది లక్షల మంది భక్తులు విజయ గణపతితో పాటు సమీపంలోని ఉప ఆలయాలను దర్శించుకునే అవకాశం ఉందన్నారు. మచిలీపట్నం నగరానికి ప్రత్యేక వన్నె తెచ్చేలా ఉత్సవాలను అత్యద్భుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**విజయ గణపతి చేతిలో 630 కిలోల బందరు లడ్డు:** మచిలీపట్నం పేరును దేశవ్యాప్తంగా చాటిచెప్పిన ప్రసిద్ధ బందరు లడ్డుకు మరో అరుదైన గౌరవం దక్కనుందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. 63 అడుగుల విజయ గణపతి చేతిలో ఏకంగా 630 కిలోల భారీ బందరు లడ్డును ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. లడ్డు తయారీకి బందరు ఎంతో ప్రసిద్ధి చెందిందని అందువల్ల బందరులోనే లడ్డును తయారు చేయడం జరుగుతుందని అన్నారు. ఆ బాధ్యత మల్లయ్య స్వీట్స్ అధినేత గౌర వెంకటేశ్వరరావు తీసుకున్నారన్నారు. మచిలీపట్నం బందరు లడ్డుకు ఉన్న చారిత్రక, ప్రత్యేక గుర్తింపును ప్రతిబింబించేలా ఈ భారీ లడ్డును మల్లయ్య స్వీట్స్ అధినేత గౌర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తయారు చేసి గణపతి చేతిలో ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 63 అడుగుల విజయ గణపతి--630 కిలోల బందరు లడ్డు కలయిక మంగినపూడి సాగరతీర మహాగణపతి ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. భారీ లడ్డును దర్శించుకునేందుకు భక్తులు, నగర ప్రజలు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు చలమలశెట్టి నరసింహారావు మాట్లాడుతూ బందరు లడ్డు రుచి, నాణ్యత, ప్రత్యేకతకు ఎంతోకాలంగా ప్రసిద్ధి చెందిందన్నారు. ఇప్పుడు 630 కిలోల భారీ లడ్డును గణపతి చేతిలో ఏర్పాటు చేయడం ద్వారా బందరు లడ్డుకు మరింత ప్రత్యేక గుర్తింపు లభించనుందని తెలిపారు. ఉత్సవ కమిటీ చక్కని ఏర్పాట్లు చేస్తోందన్నారు. బందరు వైభవాన్ని పునఃప్రతిష్ఠించేలాగా రాజకీయాలకు, కుల మతాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ మాట్లాడుతూ సాగరతీర మహాగణపతి ఉత్సవాల్లో 630 కిలోల బందరు లడ్డు భక్తులకు ప్రత్యేక దర్శనంగా నిలవనుందని అన్నారు. భక్తులకు ఆధ్యాత్మిక ఆనందంతో పాటు మచిలీపట్నం ప్రత్యేకతను చాటిచెప్పేలా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వినాయకుని సన్నిధిలో భక్తి పరిమళాలు వెదజల్లేలా, సాగర అలల సాక్షిగా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరియనుంది. గణనాథుని దర్శనంతో భక్తుల హృదయాల్లో భక్తి భావం మరింత పెంపొందనుంది. విఘ్నేశ్వరుని కృపతో మచిలీపట్నం ప్రజలకు సుఖశాంతులు, సిరిసంపదలు చేకూరాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. సాగరతీర మహాగణపతి ఉత్సవాలు నగర ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలవనున్నాయి. ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ 63 అడుగుల విజయ గణపతి కి 630 కిలోల బందరు లడ్డు అనే అరుదైన కలయిక మంగినపూడి సాగరతీర గణపతి ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని పేర్కొన్నారు. అనంతరం మల్లయ్య స్వీట్స్ అధినేత గౌర వెంకటేశ్వరరావును శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మద్దుల గిరీష్ కుమార్ , తాడేపల్లి మెహెర్ బాబా, వేమూరి బాలరత్నం, పరిమి శేషగిరిరావు, కుమ్మరి జలా చంద్రుడు,గౌర వెంకటేశ్వరావు,బులియన్ జ్యువెలరీ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఉడత్తు కిషోర్, గడ్డం రాజు,యండూరి సురేష్,నగర ప్రముఖులు, విద్య, డీఆర్డీఏ, రెవెన్యూ, పోలీస్ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ నిర్ణయమే శిరోధార్యం

● స్థానిక ఎన్నికల్లో జనసేన బలం చూపుదాం ● అప్పగించిన బాధ్యతలను చక్కగా నిర్వర్తిద్దాం ● సీట్ల సర్దుబాటు, కేటాయింపులు అధ్యక్షుల వారు చూస్తారు ● జనసేన పార్టీ స్థానిక సంస్థల అవగాహన కార్యక్రమంలో ముగింపు సందేశం అందించిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహార్








**గుంటూరు,కలంకౌంటర్ :** "పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశమే మనకు శిరోధార్యం. కో ఆర్డినేషన్ కమిటీల్లో మీకు ఇచ్చిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించండి. సీట్ల సర్దుబాటు, కేటాయింపు వంటి అంశాలన్నీ అధ్యక్షుల వారు చూసుకుంటారు. ఎట్టి పరిస్థితుల్లో పార్టీ శ్రేణుల ఆత్మగౌరవం దెబ్బతినకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీలో నిలుస్తుంద"ని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు, జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ చెప్పారు. బుధవారం తాడేపల్లిలో అన్నపూర్ణ కన్వెన్షన్ హాలులో జరిగిన జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల అవగాహన కార్యక్రమం ముగింపు సందేశాన్ని శ్రీ మహనోహర్ గారు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "కమిటీలు ఎప్పుడూ యాక్టివ్ గా ఉండాలి. పార్టీ శ్రేణులతో నిత్యం మమేకం అవుతూ, వారిని సమన్వయం చేసుకోవాలి. స్థానిక ఎన్నికల్లో బలంగా పోరాడేలా, పోటీ చేసిన ప్రతి చోట గెలిచేలా జనసైనికులు, వీర మహిళల్ని సన్నద్ధం చేయండి. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఓ ప్రత్యేక ఫార్మట్ లో వచ్చే నివేదిక ప్రొఫార్మాను జాగ్రత్తగా నింపి, క్షేత్రస్థాయి పరిస్థితిని శ్రీ పవన్ కళ్యాణ్ గారికి తెలియజెప్పండి. ఈ నెల 15వ తేదీ నాటికి అధ్యక్షుల వారు అందుబాటులోకి వస్తారు. ఎప్పటికప్పుడు సమావేశాలు, సూచనలు, టెలీ కాన్ఫరెన్సులు ఉంటాయి. వాటిని తప్పక హాజరై, పార్టీ అందించే మార్గదర్శకాలను పార్టీ శ్రేణులకు తెలియజెప్పాలి. అలాగే ఎన్డీయే పార్లమెంటరీ సమావేశాల్లో పార్టీ తరఫున ముగ్గురు పాల్గొనాలి. సమావేశాల్లో పార్టీ విధానాన్ని మాత్రమే చెప్పాలి. సీట్లు, సర్దుబాట్లు అనేవి అధ్యక్షుల వారి పరిధిలో ఉంటాయి. రేపటి నుంచి కో ఆర్డినేషన్ కమిటీలన్నీ పూర్తి యాక్టివ్ మోడ్ లో తమకు అప్పగించిన బాధ్యతల్లో కొనసాగాలి" అన్నారు.

**రాజకీయ శత్రువులతో జాగ్రత్త : శ్రీ తమ్మిశెట్టి శివశంకర్ గారు, పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎం ఎస్ ఎం ఈ చైర్మన్..** ముగింపు ఉపన్యాసంలో పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ టి శివ శంకర్ గారు మాట్లాడుతూ "మనలో మనకే గొడవలు పెట్టేలా, లేనిపోని విషయాలను ప్రచారం చేసేందుకు రాజకీయ శత్రువులు కాచుకొని కూర్చున్నారు. గందరగోళం చేసి, గొడవలు సృష్టించి కూటమి పార్టీల్లో ఐక్యత దెబ్బతినేలా వారు రకరకాల కుట్రలు పన్నుతారు. దానిపట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చే అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. వైసీపీ డబ్బును వెదజల్లి విష ప్రచారం చేయడానికి సిద్ధంగా ఉంది. దీన్ని జన సైనికులు, వీర మహిళలు తమ తెలివితోనే ఎదుర్కోవాలి. ప్రభుత్వంలో మనం ఉన్నామనే ధీమా వద్దు. రాజకీయ శత్రువులు దేనికైనా తెగించే క్రూర మనస్తత్వం ఉన్న సమూహం. చాలా జాగ్రత్తగా స్థానిక పరిస్థితులను బట్టి వ్యూహాలు రూపొందించుకోండి. నాయకులతో సమన్వయం చేసుకొని, ఎన్నికలు ఎలా చేయాలో అనుభవం గడించండి. ఇది రేపటి ఎన్నికలకు కూడా చాలా ఉపయోపడుతుంది. అధ్యక్షుల వారి నిర్ణయాలను సదా అనుసరించే సైనికుల్లా పోరాడుదాం" అన్నారు.

# కాణిపాక బ్రహ్మోత్సవాలకు కావలి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్‌కు ఆహ్వానం

● ఘనంగా కాణిపాక స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలు - ఆహ్వాన పత్రికను అందుకున్న తటవర్తి రమేష్ ● భక్తిశ్రద్ధలతో కాణిపాక బ్రహ్మోత్సవాలు: తటవర్తి రమేష్‌కు దేవస్థాన సిబ్బంది ఆహ్వానం



**కావలి,కలంకౌంటర్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను కావలి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు,రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి తటవర్తి రమేష్‌కు దేవస్థాన సిబ్బంది మర్యాదపూర్వకంగా అందజేశారు. కావలి పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు రమేష్‌ను కలిసి బ్రహ్మోత్సవాల వివరాలను వివరించి, అధికారిక ఆహ్వాన పత్రికను, స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలనుఅందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది మాట్లాడుతూ, స్వయంభూగా వెలసి భక్తుల కోర్కెలు తీర్చే కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది సెప్టెంబర్ 14-09-2026 నుండి అక్టోబర్ 04-10-2026 వరకు 21 రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల రోజుల్లో స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు, పలు వాహన సేవలు, రథోత్సవం, కల్యాణోత్సవం వంటి వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరుగుతాయని వివరించారు. ఈ పవిత్ర ఉత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని కోరారు.

**స్వామివారి ఆశీస్సులు అందరికీ కలగాలి: తటవర్తి రమేష్..** ఆహ్వాన పత్రికను స్వీకరించిన అనంతరం కావలి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ మాట్లాడుతూ... సకల విఘ్నాలను తొలగించి సకల శుభాలను ప్రసాదించే కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం అందడం తన అదృష్టంగా భావిస్తున్నానని హర్షం వ్యక్తం చేశారు. విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ఆర్యవైశ్యులు వ్యాపార, సామాజిక రంగాల్లో మరింత ముందుకు సాగాలని స్వామివారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో తప్పక కాణిపాకం క్షేత్రాన్ని దర్శించుకుని స్వామివారి పూజల్లో పాల్గొంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, పట్టణ ప్రముఖులు మరియు దేవస్థాన ప్రతినిధులు పాల్గొన్నారు.

# చంద్రబాబు అక్రమ అరెస్టుకు గుర్తుగా కొవ్వొత్తుల ప్రదర్శన



**కందుకూరు,కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు మూడేళ్లు పూర్తయ్యాయి. గత జగన్ ప్రభుత్వం.... అన్యాయంగా, ఆధారాలు లేకుండా చంద్రబాబుని అరెస్టు చేయించి, 53 రోజులపాటు జైలులో నిర్బంధించింది. ఆ చీకటి రోజున గుర్తు చేసుకుంటూ.... తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు నిజం గెలిచింది కార్యక్రమాన్ని, కందుకూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు ఆదేశాలతో బుధవారం సాయంత్రం నిర్వహించారు. నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని... కొవ్వొత్తులు చేతబట్టి జై తెలుగు దేశం, జై చంద్రబాబు, సైకో పీడ వదిలింది - నిజం గెలిచింది... అంటూ నినాదాలు చేశారు. చంద్రబాబు అక్రమ అరెస్టు.... 2024 ఎన్నికల్లో వైసిపి ఘోర పరాజయానికి నాంది పలికిందని నేతలు అన్నారు. జగన్ నిరంకుశ పాలనకు ధీటుగా ప్రజలు మంచి తీర్పుఇచ్చారని గుర్తు చేసుకున్నారు. ఫలితంగానే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో, రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధివైపు దూసుకు వెళుతోందని తెలిపారు. రాజధాని అమరావతి, పోలవరం, తాజాగా వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాలు పూర్తిచేసి.... చంద్రబాబు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీను, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, , పట్టణంలోని పలు వార్డుల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజకీయ ఉనికికోసమే ఎంపీ పై బురద జల్లుతున్నారు

-ఎంపీ పై వైసిపి నేతల ఆరోపణలను ఖండించిన కందుకూరు టిడిపి నేతలు





**కందుకూరు,కలంకౌంటర్ :** నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పై వైసీపీ నేతలు అనిల్ కుమార్ యాదవ్, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలను కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో... స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. నేతలు మాట్లాడుతూ.... వీపిఆర్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా విద్య, వైద్యం, వాటర్ ప్లాంట్ లు, దేవాలయాల నిర్మాణం, దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాల పంపిణీ, బ్రిడ్జిల నిర్మాణం, అనాధ శరణాలయాలకు సహకారం, వసతుల ఏర్పాటు, కార్యక్రమాలకు విరాళాలు అందించటం.... ఇలా ఎన్నో మంచి పనులను నిర్వహిస్తున్న గొప్ప వ్యక్తులు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు అని కొనియాడారు. అలాంటి మహోన్నత వ్యక్తిత్వం కలిగిన ప్రభాకర్ రెడ్డి పై, వైసీపీ నేతలు అనిల్ కుమార్ యాదవ్, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వేలాదిమంది అభిమానుల మనసులను గాయపరిచాయని అన్నారు. క్వార్ట్జ పరిశ్రమ విషయంలో వారు ఎంపీ పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, రాజకీయ ఉనికి కోసం ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సంపాదన కోసం వేమిరెడ్డి రాజకీయాల్లోకి రాలేదని, ఆయనకు వ్యాపారాలు కొత్తేమీ కాదని నేతలు మాట్లాడారు. జగన్ మెప్పుకోసం ఎంపీ పై ఆరోపణలు చేస్తే... ప్రజల్లో చులకన అయి-ంపోతారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. నీటిపారుదల శాఖ మంత్రిగా ఉండి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయటం చేతగాని అనిల్ కు, అందరివాడిగా ప్రశంసలు అందుకుంటున్న వేమిరెడ్డిగారిని విమర్శించే స్థాయి, అర్హత లేదని నేతలు విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో అన్ని దోచుకుని, కోట్లు సంపాదించి, బెట్టింగ్ బంగారాజుగా పేరు తెచ్చుకున్న అనిల్... ఇకనైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని నేతలు ఘాటుగా హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, రాచగర్ల సుబ్బారావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మాదాల లక్ష్మీ నరసింహం, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, పట్టణ మాజీ అధ్యక్షులు కంద్రా మాల్యాద్రి, పిడికిటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త బైక్ ఇచ్చి, నష్టపరిహారం చెల్లించాలి...

## కృష్ణా జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు...

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** తయారీలో లోపం ఉన్న "టీవీఎస్ జూపిటర్ 125" వాహనాన్ని తీసుకొని వినియోగదారురాలికి కొత్త వాహనం తిరిగి ఇవ్వాలని లేదా బైకు ఖరీదు 1,15,500రూపాయలు 9% వడ్డీతో తిరిగి చెల్లించాలని, మానసిక ఒత్తిడి కలగజేసినందుకు 25 వేల రూపాయలు లీగల్ ఖర్చులు కింద పదివేల రూపాయలు చెల్లించాలని మచిలీపట్నం టీవీఎస్ డీలర్,విజయవాడ టీవీఎస్ డీలర్, కాసా మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారిని ఆదేశిస్తూ కృష్ణాజిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు సిహెచ్. కిషోర్ కుమార్ సభ్యురాలు రాయల శ్రీలక్ష్మి బుధవారం తీర్పు చెప్పారు.. 30 రోజులలోపు తీర్పు అమలు చేయాలని కమిషన్ ఆదేశించింది. విజయం సాధించిన వినియోగదారురాలు తరఫున న్యాయవాది లంకిశెట్టి బాలాజీ ఫిర్యాదు వివరాలను వివరించారు. కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్ గా పనిచేస్తున్న లక్ష్మణ్ కుమార్ భార్య బొమ్మిశెట్టి వెంకట నాగ దీప్తి మచిలీపట్నంలో లెక్చరర్ గా పనిచేస్తున్నారు . 2024 జులై ఒకటో తారీఖున నాగ దీప్తి మచిలీపట్నం జిల్లా పరిషత్ ఎదురుగా గల టీవీఎస్ డీలర్ కసా మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వద్ద 1,15,500 చెల్లించి టీవీఎస్ జూపిటర్ 125 కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన తేదీ నుండి వాహనంలో తయారీలోపం వలన పలు ఇబ్బందులకు గురిచేసింది. ఏడుసార్లు సర్వీసింగ్ చేయించిన సర్వీసు డబ్బులు తీసుకున్నారు గాని బండిలోని లోపాన్ని సరిచేలేకపోయారు. వినియోగదారురాలు దీప్తి ఆమె భర్త లక్ష్మణ కుమార్ అనేక పర్యాయములు మచిలీపట్నం మరియు విజయవాడలోని కాసా మోటార్స్ వారిని సంప్రదించిన ఫలితం లేకపోయింది. విసిగివేసారిన వినియోగదారులు న్యాయం కోసం కృష్ణా జిల్లా వినియోగదారుల కమిషన్ లో 2025 జూన్ 30వ తారీఖున ఫిర్యాదు దాఖలు చేసింది.

వినియోగదారుల కమిషన్ ఇరుపక్షాల వాద ప్రతివాదంలో విన్న పిదప, వాహనాన్ని శిక్షణ పొందిన మెకానిక్ తో పరీక్ష చేయించి వాహనం తయారీలో లోపం ఉన్న విషయాన్ని నిర్ధారించారు. టీవీఎస్ వాహనంలో తయారీలో ఉందని వినియోగదారులకు ఇబ్బంది కలగజేసినట్లుగా నిర్ధారిస్తూ కమిషన్ బుధవారం తీర్పు చెప్పింది. తీర్పు ప్రకారం 30 రోజుల్లోపు కొత్త వాహనం గాని లేదా వాహన ఖరీదును 9 శాతం వడ్డీతో తిరిగి చెల్లించాలని 25 వేల రూపాయలు మానసిక ఒత్తిడికి గురి చేసినందుకు పదివేల రూపాయలు కోర్టు ఖర్చులు కింద చెల్లించాలని తీర్పు చెప్పారు. వినియోగదారురాలు తరుపున లంకిశెట్టి బాలాజీ, లంకి శెట్టి సాయి ఫణి సంతోష్, చిన్నంశెట్టి ఆశా నాగ మౌనిక,మద్దాల సువర్ణ రాజు న్యాయవాదులుగా వ్యవహరించారు.

# ప్రతీకారం తీర్చుకోవాలంటే నిమిషం చాలు... కానీ సహనంతో వ్యవహరిస్తా

● నన్ను ఇబ్బంది పెట్టినట్టే... పవన్ కళ్యాణ్‌నూ వేధించారు ● నా అక్రమ అరెస్టును నిరసిస్తూ నాడు చేపట్టిన ప్రజాందోళనలతో బాధ్యత మరింత పెరిగింది ● నాపై చేసిన ఆరోపణలు రుజువు చేయలేకపోయారు... అదే నా నిబద్ధత ● అధికారంలో ఉండగా అరాచకం.... ఓటమి చెందాక కుట్రలు గొడ్డలి పార్టీ విధానం ●అరాచకాలు భరించలేక గొడ్డలి పార్టీ అధ్యక్షున్ని తండ్రే దూరం పెట్టారు ● నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలు తీశారు... ఏపీపీఎస్సీలో అక్రమాలతో యువతను మోసం చేశారు ● గొడ్డలి పార్టీ కుట్రలకు ప్రజలే బుద్ధి చెప్పాలి ● పి.గన్నవరం పర్యటనలో గొడ్డలి పార్టీ కుట్రలను ప్రజలకు వివరించిన ముఖ్యమంత్రి








**పి.గన్నవరం,కలంకౌంటర్ :** రాజకీయ కక్షలకు తాను ఎన్నడూ ప్రాధాన్యం ఇవ్వనని... ప్రజల కోసం... రాష్ట్రాభివృద్ధి కోసం సహనంతో.. ఓపిగ్గా ఉండడం తనకు అలవాటని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విలువలతో కూడిన రాజకీయం, పేద ప్రజలకు మెరుగైన జీవితం, తెలుగుజాతి అభివృద్ధి కోసం తాను నిరంతరం ఆలోచిస్తానని స్పష్టం చేశారు. మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో భాగంగా బుధవారం కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం పందువారిపేటలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. దీంట్లో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి అచ్చెన్నాయుడు కొన్ని కీలకాంశాలను ప్రస్తావించారు. మూడేళ్ల క్రితం సీఎం చంద్రబాబును నాటి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిందని... ఆ అక్రమ అరెస్ట్ జరిగి సెప్టెంబర్ 9కి సరిగ్గా మూడేళ్లు అయిందంటూ నాటి సంగతులను ఆవేదనతో ప్రస్తావించారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా నాడు జరిగిన అంశాలను బహిరంగ సభలో గుర్తు చేసుకున్నారు. నంద్యాలలో సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన సమయంలో మూడేళ్ల క్రితం సెప్టెంబరు 9న అర్ధరాత్రి వచ్చి తనను అరెస్టు చేస్తామని చెప్పారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఏ తప్పు చేయకపోయినా అర్ధరాత్రి పూట తనను అరెస్టు చేశారని తెలిపారు. తనపై ఉన్న ఆరోపణలు ఏమిటని ప్రశ్నిస్తే.. అరెస్టు చేసిన తర్వాత చెబుతామని చెప్పారని అన్నారు. ముఖ్యమంత్రిగా పని చేసిన తనను ఉన్నపళంగా అరెస్టు చేసి రాజమహేంద్రవరం జైలుకు తరలించారని పేర్కొన్నారు. తన జీవితంలో ఎన్నడూ ఊహించని ఆ సంఘటన ఓ దుర్మార్గమైన వ్యక్తి ఆలోచనల వల్ల జరిగిందని వ్యాఖ్యానించారు. తాను 48 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, 31 ఏళ్ల క్రితమే తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టానని చంద్రబాబు అన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని, పేద ప్రజలకు, తెలుగు జాతికి న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నానని తెలిపారు. తనపై అనేకమంది ఆరోపణలు చేశారని, కోర్టులకు వెళ్లారని, అయితే తనపై చేసిన ఆరోపణలను రుజువు చేయలేకపోయారని చెప్పారు. అదే తన నిబద్ధతకు నిదర్శనమన్నారు. రాజకీయాలపై కుటుంబం ఆధారపడకూడదనే ఉద్దేశంతో 36 ఏళ్ల క్రితమే కుటుంబ వ్యాపారాన్ని ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. తాను ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో కుటుంబ వ్యాపారాన్ని తన సతీమణికి అప్పగించానన్నారు. తనకు ధన వ్యామోహం లేదని, తెలుగు జాతి బాగుండాలన్నదే నిరంతరం తన ఆలోచన అని స్పష్టం చేశారు.

**నాటి సంఘీభావాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటా..** జైలులో ఉన్న సమయంలో తనకేం జరుగుతుందోనన్న ఆందోళనతో తెలుగు జాతి మొత్తం రోడ్లపైకి వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. నేను జైల్లో ఉన్నప్పుడు నాకు సంఘీభావం తెలిపిన వారిని... నా గురించి ఆందోళన చెందిన వారిని జీవితాంతం గుర్తుంచుకుంటానని తెలిపారు. రాజమండ్రి జైల్లో ఉన్న తనను కలిసేందుకు... సంఘీభావం తెలిపేందుకు కొందరు అడ్డుపడినా హైదరాబాద్‌లో టెకీలు సైతం ముందుకు వచ్చి నిరసనలు తెలిపారని సీఎం చంద్రబాబు చెప్పారు. దేశవిదేశాల్లోని తెలుగు వారంతా స్పందించారన్నారు. ఇక నాడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపిన మద్దతును ఎన్నటికీ మరిచిపోలేనన్నారు. తనకు సంఘీభావం తెలిపేందుకు వస్తుంటే ఆయననూ అడ్డుకున్నారని చంద్రబాబు అన్నారు. అయినా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా పవన్ కల్యాణ్ తనకు సంఘీభావం తెలిపారని గుర్తుచేశారు. గత పాలకులు పెట్టిన కేసులను కోర్టులు కొట్టేశాయని, ఈడీ వంటి సంస్థలు కూడా ఇందులో ఏమీ లేదని తేల్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. గతంలో అచ్చెన్నాయుడు వంటి నేతలను బలవంతంగా అరెస్టు చేసి వేధించారని, పవన్ కల్యాణ్ విశాఖ వెళ్లినప్పుడు ఆయన్ను అక్కడి నుంచి బలవంతంగా వెనక్కి పంపించారని అన్నారు. ఇలాంటి ఘటనలు గత పాలనలో ఎన్నో జరిగాయని సీఎం పేర్కొన్నారు.

**రాజకీయ కక్షలకు దూరంగా....** తాను ముఖ్యమంత్రి అయ్యాక ప్రతీకారం తీర్చుకోవాలంటే ఒక్క నిమిషం చాలని చంద్రబాబు అన్నారు. కానీ తాను ఆ పని చేయలేదని స్పష్టం చేశారు. తాను సహనంగా... ఓపిగ్గా ఉంటానని వెల్లడించారు. గత పాలకులు అంతగా వేధించినా... ఏం చేయలేకపోతున్నానని చాలా మంది అనుకుంటారని.. కానీ అది తన విధానం కాదన్నారు. తెలుగు జాతికి న్యాయం జరగాలన్న లక్ష్యంతోనే పని చేస్తానని.. రాజకీయ కక్షలకు దూరంగా ఉంటానని సీఎం చంద్రబాబు చెప్పారు. తనపై నక్సల్స్ దాడి చేసినా తన సిద్ధాంతాలను... తన లక్ష్యాన్ని మరిచిపోలేదన్నారు సీఎం చంద్రబాబు. ప్రజల కోసం పనిచేయడంలో వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు. తాను గతంలో నక్సల్స్ సిద్ధాంతాన్ని వ్యతిరేకించానని చంద్రబాబు తెలిపారు. అలిపిరిలో తనపై క్లైమోర్ మైన్లతో దాడి జరిగినా ప్రజల కోసమే పనిచేశానని గుర్తుచేశారు. శాంతిభద్రతల విషయంలో తాను ఎప్పుడూ కఠినంగానే ఉంటానని అన్నారు. ముఠా కక్షల విషయంలో మాట వినని తన పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను సైతం అరెస్టు చేయించిన చరిత్ర తనదని పేర్కొన్నారు. సీఎంగా తాను సమర్థంగా పనిచేయకపోతే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని చంద్రబాబు అన్నారు. అందుకే ప్రతి అంశాన్ని బాధ్యతగా తీసుకుని పనిచేస్తున్నానని తెలిపారు. ప్రజలు ఆనందంగా, ఆరోగ్యంగా, మంచి జీవన ప్రమాణాలతో ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని ముఖ్యమంత్రి చెప్పారు.

**నాడు-నేడు కేరాఫ్ బెంగళూరే..** ఇదే సమయంలో గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ నైజాన్ని... ఆయన కుటుంబ సభ్యులే చెప్పిన విషయాల ద్వారా అర్థం చేసుకోవాలని చంద్రబాబు వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఆయన కుమారుడి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తాను అప్పట్లోనే చెప్పానని గుర్తుచేశారు. జగన్‌ను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చదువుకోవడానికి అమెరికా పంపిస్తే.. తిరుగుటపాలో వచ్చేశాడని స్వయంగా వైఎస్ చెప్పిన విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన కుమారుడిని ఎప్పుడూ ఏపీకి రానీయలేదని చంద్రబాబు అన్నారు. కొడుకుతో ఇబ్బందులు భరించలేక జగన్‌ను బెంగళూరులోనే ఉంచారని ఆయన తల్లి విజయమ్మ మాజీ ముఖ్యమంత్రి రోశయ్యకు చెప్పుకుని బాధపడ్డారని చంద్రబాబు నాటి సంగతులను గుర్తు చేశారు. తర్వాత కాలంలో ఈ విషయాన్ని రోశయ్య స్వయంగా చెప్పారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి తన కుమారుడిని బెంగళూరు లాంటి చోట ఉంచాల్సిన పరిస్థితి వచ్చిందంటే.. గొడ్డలి పార్టీ అధ్యక్షుడి నైజం ఎలాంటిదో ప్రజలు అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్యను కూడా చంద్రబాబు ప్రస్తావించారు. బాబాయి వివేకాను గొడ్డలి వేటుతో కిరాతకంగా చంపేశారని అన్నారు. తెల్లవారితే ముఖ్యమంత్రిగా ఉన్న తనపై నిందలు వేస్తూ వారి పత్రికలో రాయించారని ఆరోపించారు. తన చెల్లి సునీతను కూడా గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ ఏమార్చారని వ్యాఖ్యానించారు. ఆ రోజే దోషులందరినీ అరెస్టు చేసి ఉంటే ఇప్పుడు పరిస్థితి ఇంత దూరం వచ్చేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు తల్లిని, చెల్లినీ కూడా ఆస్తి కోసం మోసం చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. అలాంటి వ్యక్తులతో రాజకీయాలు చేయాల్సిన దుస్థితి రాష్ట్రానికి వచ్చిందని అన్నారు.



**విభజన కంటే 2019--24లోనే ఎక్కువ నష్టం..** 2019--24 మధ్య కాలంలో రాష్ట్ర విభజన కంటే ఎక్కువ నష్టం ఏపీకి జరిగిందని చంద్రబాబు అన్నారు. గత పాలనలో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని ఒక్కొక్కటిగా సరిచేసుకుంటూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను కక్షతో గోదాట్లో కలిపేశారని ఆరోపించారు. రాజకీయ కక్షతో కాంట్రాక్టర్‌ను మార్చకుండా ఉండి ఉంటే 2021కే పోలవరం ప్రాజెక్టు పూర్తై ఉండేదని అన్నారు. ఇప్పుడు ఎల్ నినో లాంటి కరవు పరిస్థితుల్లో పోలవరం పూర్తై ఉంటే ఆ ప్రాజెక్టే ఏపీని ఆదుకుని ఉండేదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టును మళ్లీ తానే ప్రారంభించాల్సి వచ్చిందని అన్నారు. వెలిగొండ నుంచి నీళ్లు వచ్చినప్పుడు ఆ ప్రాంత ప్రజలకు ఎంత ఆనందం కలిగిందో.. తనకూ అంతే ఆనందం కలిగిందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు నీరిచ్చినప్పుడూ ఎంతో సంతోషించానన్నారు. గత పాలనలో బయటకు రావాలన్నా, మాట్లాడాలన్నా ప్రజలు భయపడే పరిస్థితి ఉండేదని సీఎం విమర్శించారు. ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల పేపర్లను ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లతో దిద్దించి అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నాసిరకం మద్యం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని సర్వనాశనం చేశారని చంద్రబాబు అన్నారు. కల్తీ మద్యం కారణంగా 30 వేల మంది చనిపోయారని, అనేకమంది ఆరోగ్యాలు కోల్పోయారని పేర్కొన్నారు. వైసీపీ ప్రజల జీవితాలతో ఆడుకుందని చంద్రబాబు అన్నారు. అందుకే 2024లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కూటమికి మద్దతు ఇచ్చారని తెలిపారు. 2024లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన మద్దతు ఢిల్లీలోనూ సంజీవనిలా పనిచేసిందని చంద్రబాబు అన్నారు. రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నామని, పోలవరం, అమరావతి నిర్మాణాలను చేపట్టగలిగామని తెలిపారు. రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాటలోకి తీసుకెళ్లేందుకు కేంద్రం సహకారంతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని సీఎం చెప్పారు.

**అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలి..** ఓవైపు అభివృద్ధి చేస్తుంటే... గొడ్డలి పార్టీ అడుగడుగునా కుట్రపూరితంగా అడ్డంకులు సృష్టిస్తుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తే 350 కేసులు వేసి అడ్డుకునేందుకు ప్రయత్నించారని చంద్రబాబు అన్నారు. ఏడాది తర్వాత ఆ ఉపాధ్యాయుల కుటుంబాల్లో చిచ్చుపెట్టేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కేసులు వేసినా సరైన ఆధారాలు లేవని కోర్టులు కూడా చీవాట్లు పెట్టాయని తెలిపారు. అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలపై చర్చించమంటే అసెంబ్లీకి వచ్చేదే లేదని గొడ్డలి పార్టీ నేతలు మొండికేస్తున్నారని చంద్రబాబు అన్నారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు బయటకు వస్తే చాలు.. ఎక్కడికి వెళ్లినా హింసే కనిపిస్తోందని ఆరోపించారు. రప్పా రప్పా అంటూ రౌడీయిజం, ఫ్లెక్సీలకు పొట్టేళ్లను బలి ఇవ్వడం వంటి చర్యలతో రాజకీయ పార్టీగా ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. సామాజిక మాధ్యమాల్లో తమ కుటుంబాల గురించి అసభ్యంగా రాయిస్తున్నారని సీఎం ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసినా గొడ్డలి పార్టీకి తాము బెదిరేది లేదని, గట్టిగానే పోరాడతామని స్పష్టం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఇన్ని రకాలుగా ఆలోచించి ప్రజలకు మేలు చేసేలా ప్రయత్నిస్తుంటే ఆ పార్టీ చేస్తున్న కుట్రలపై ప్రజలు ఆలోచించాలని కోరారు. ప్రజలకు ఏ విధంగా మంచి చేయాలన్న అంశంపై రెండు రోజుల పాటు సమావేశాలు నిర్వహించి పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశామని తెలిపారు. జిల్లా కలెక్టర్లతోనూ సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయిలో పౌరసేవలు మెరుగ్గా అందేలా స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పాలనపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించి ఎప్పటికప్పుడు లోపాలను సరిచేసుకుంటున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

# కలంకౌంటర్ దినపత్రిక వినాయక చవితి వ్రత కల్పం పుస్తకం ఆవిష్కరణ

● మంత్రి కొల్లు రవీంద్ర చేతులు మీదుగా ● పాల్గొన్న సాగర తీర మహా గణపతి ఉత్సవ సేవా సమితి







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కలం కౌంటర్ దినపత్రిక ప్రచురించిన వినాయక చవితి వ్రత కల్పం బుక్స్ రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర స్థానిక వేడుక ఫంక్షన్ హాల్ లో ఆవిష్కరించారు.అతిరథ మహారథులు ఆశీస్సులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సాగర తీర మహా గణపతి ఉత్సవ సేవా సమితి అధ్యక్షుడు చలమలశెట్టి నరసింహారావు, మద్దుల గిరీష్ కుమార్, ఘనాపాటి విష్ణుబోట్ల సూర్య నారాయణ శర్మ, మోట మర్రి బాబా ప్రసాద్,వేమూరి బాలరత్నం,తాడేపల్లి మెహెర్ బాబా,పరిమి శేషగిరిరావు, గడ్డం రాజు ,, ఉడత్తు కిషోర్, గౌరా వెంకటేశ్వరరావు, కొత్తగుండు రమేష్, కుమ్మరి జలా చంద్రుడు,యండూరి సురేష్ , మాది రెడ్డి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com